

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 11-07-2026 | సంపుటి - 29 | సంచిక - 49 | రూ : 4 | పేజీలు: 8


## 'రాముడి మీద ఆన..'

# 117 స్థానాలు గెలుస్తాం



- అసెంబ్లీ సీట్లు 182కి పెరుగుతాయ్..
- 20 మంది ఎంపీలను గెలిపించి రాహుల్‌ను ప్రధాని చేస్తాం
- అధికారంలోకి వస్తామంటున్న కేటీఆర్ తన చెల్లెలి మాటకు బదులివ్వాలి
- రైతు ఆశీర్వాద సభలో

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఖమ్మం: 'ఖమ్మం నగరంలో 2023 జులైలో నిర్వహించిన బహిరంగసభ తర్వాత జరిగిన చర్చాగోష్ఠిలో 2023 డిసెంబరు ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుస్తుందని చెప్పాను. అది నిజమైంది. సరిగ్గా 36 నెలల తరువాత చెబుతున్నా.. రాబోయే ఎన్నికలు 2028 డిసెంబరులో కాదు.. 2029 మే లేదా జూన్‌లో జరుగుతాయి. అప్పుడు తెలంగాణలో ఉన్న ఎంపీ స్థానాలు 17 నుంచి 26కు, అసెంబ్లీ నియోజకవర్గాలు 119 నుంచి 182కు పెరుగుతాయి. శాసనసభ ఎన్నికల్లో 117 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకొని రెండోసారి అధికారంలోకి వస్తాం. ఇది భద్రాచలం రాముడి మీద ఆన' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా నిధుల తుది విడత విడుదలను పురస్కరించుకొని ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలోని మత్కేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రైతు ఆశీర్వాద బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. వేదికపై తుది విడత రైతు భరోసా నిధులు 1009.15 కోట్ల రూపాయలను 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు.

*** భాజపాతో మాట్లాడలేదని హరీశ రాముడి మీద ఒట్టు వేస్తారా?**

"కేసీఆర్.. 2026 జులై 10వ తేదీని గుర్తుపెట్టుకోవాలి. జరగబోయే కురుక్షేత్రంలో **తరువాయి 2లో**



## తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలం

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి
- జర్మనీ ప్రతినిధి బృందంతో భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ అత్యున్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బవేరియన్ (జర్మనీ) మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ **తరువాయి 2లో**

## ఆధార్ ధ్రువీకరణతో.. ఇంటి నుంచే 100 రవాణా సేవలు

2లో





## డిజిటల్ టికెట్లపై కొత్త నిబంధన.. రైల్వే శాఖ కీలక ప్రకటన

- వాట్సాప్ ఫార్వార్డ్‌లు, స్క్రీన్‌షాట్లు ఇకపై చెల్లవని స్పష్టం
- టికెట్ బుక్ చేసిన ఫోన్‌లోనే ఒరిజినల్ టికెట్ చూపించాలని స్పష్టీకరణ
- ఈ నిబంధనపై ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు

2లో

## అయ్యప్పస్వామికి పబ్లిసిటీ అవసరం లేదు: దేవస్వం బోర్డు



- శబరిమల యాత్రలో భారీ సంస్కరణలు ప్రకటించిన దేవస్వం బోర్డు
- వివాదాస్పద 'అయ్యప్ప సంగమం' కార్యక్రమం రద్దు
- ఆన్‌లైన్‌లో 550 గదుల బుకింగ్.. సెక్యూరిటీ డిపాజిట్ ఎత్తివేత
- ఏఐ టెక్నాలజీతో భక్తుల రద్దీ నియంత్రణ.. పెరగనున్న పడిపూజలు

శబరిమల జూలై 10 : శబరిమల వార్షిక యాత్రను పురస్కరించుకుని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కీలక సంస్కరణలను ప్రకటించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, యాత్రా నిర్వహణను ఆధునికీకరించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. **తరువాయి 2లో**


## ఒకరికి మించి భార్యలుంటే ప్రభుత్వ ఉద్యోగం డౌట్



- బహుభార్యత్వం పాటిస్తే ప్రభుత్వ పథకాలకు అనర్హులు
- ఇద్దరు భార్యలున్న ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయం
- అసోం 2026-27 బడ్జెట్‌లో ఈమేరకు కీలక ప్రతిపాదనలు
- మహిళా సాధికారత కోసమే ఈ చర్యలని ప్రభుత్వం స్పష్టీకరణ

2లో

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే.. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా



- డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తున్న మాజీ ప్రధాని షేక్ హసీనా
- కోర్టు ఎదుట లొంగిపోతానని సంచలన ప్రకటన
- తనతో పాటు అవామీ లీగ్ సీనియర్ నేతలు కూడా వస్తారని వెల్లడి
- 2024లో ప్రజా ఉద్యమంతో పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం

2లో



## స్టీవ్ వాకు మోదీ ప్రత్యేక కానుక

- స్టీవ్ వాకు 20 ఏళ్ల నాటి ఫొటోను బహూకరించిన ప్రధాని మోదీ
- ఆసీస్ ప్రధానితో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో పర్యటన
- చెన్నైలో తొలిసారిగా బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ నిర్వహణకు నిర్ణయం

# 'రాముడి మీద ఆన..' 117 స్థానాలు గెలుస్తాం



ఖమ్మం:'ఖమ్మం నగరంలో 2023 జులైలో నిర్వహించిన బహిరంగసభ తర్వాత జరిగిన చర్చాగోష్ఠిలో 2023 డిసెంబరు ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుస్తుందని చెప్పాను. అది నిజమైంది. సరిగ్గా 36 నెలల తరువాత చెబుతున్నా.. రాబోయే ఎన్నికలు 2028 డిసెంబరులో కాదు.. 2029 మే లేదా జూన్‌లో జరుగుతాయి. అప్పుడు తెలంగాణలో ఉన్న ఎంపీ స్థానాలు 17 నుంచి 26కు, అసెంబ్లీ నియోజకవర్గాలు 119 నుంచి 182కు పెరుగుతాయి. శాసనసభ ఎన్నికల్లో 117 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకొని రెండోసారి అధికారంలోకి వస్తాం. ఇది భద్రాచలం రాముడి మీద ఆన' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా నిధుల తుది విడత విడుదలను పురస్కరించుకొని ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలోని మత్కేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రైతు ఆశీర్వాద బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. వేదికపై తుది విడత రైతు భరోసా నిధులు 1009.15 కోట్ల రూపాయలను 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు.

*** భాజపాతో మాట్లాడలేదని హరీశ్ రాముడి మీద ఒట్టు వేస్తారా?**

''కేసీఆర్.. 2026 జులై 10వ తేదీని గుర్తుపెట్టుకోవాలి. జరగబోయే కురుక్షేత్రంలో కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి తప్పిస్తాం.. ఈ రోజు నేనిచ్చిన ఈ మాట కోసం మేమంతా రోజూ 18 గంటలు పనిచేస్తాం. సుభిక్షమైన పరిపాలన అందించి రామరాజ్యం తీసుకొస్తాం. హరీశ్‌రావు చీకట్లో భాజపాతో సంప్రదింపులు జరుపుతున్నారు. కాదంటే భద్రాద్రి రాముడు, కేసీఆర్‌పైనా ఒట్టు వేయాలి. అధికారంలోకి వస్తామని కేటీఆర్ చెబుతుంటే, భారాసను భాజపాలో విలీనం చేస్తారని, ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి రూ.1,400 కోట్లను కొల్లగొట్టారని అతని చెల్లెలు కవిత చెబుతున్నారు. దీనికి కేటీఆర్ జవాబివ్వాలి. భారాస పదేళ్ల పాలనలో దళితులను ఇసుక మాఫియా లారీలతో తొక్కించింది. గిరిజనులకు బేడీలు వేశారు. ఉద్యోగాల కోసం పోరాడిన యువకులను లాఠీలతో కొట్టారు. అలాంటప్పుడు భారాసకు ప్రజలు ఎలా ఓట్లు వేస్తారో చెప్పాలి.

*** కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో బంధించాం..**

2023 జులైలో ఆదిలాబాద్‌లో మొదలైన భట్టి విక్రమార్క పాదయాత్ర ఖమ్మంలో ముగింపు.. భారాసను పాతిపెట్టడానికి కంకణం కట్టుకొన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా రాహుల్‌గాంధీని ఆహ్వానించాం. సరిగ్గా 36 నెలలు పూర్తయిన సందర్భంగా ఇదే జులైలో ఆశీర్వాద సభ పెడితే వేలమంది తరలివచ్చారు. భవిష్యత్తు ప్రణాళికలను రచించుకొని, తెలంగాణ ప్రజలు రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఏ తీర్పు ఇవ్వనున్నారో ఈ సభ చెబుతోంది. రాహుల్ బహిరంగ సభ తర్వాత.. కొందరు పాత్రికేయులు గాంధీభవన్‌లో నిర్వహించిన చర్చాగోష్ఠిలో భాజపాను, కేసీఆర్‌ను తట్టుకుని ఎలా గెలుస్తారని నన్ను అడిగారు. ఆనాడే వారికి చెప్పాను. ఖమ్మం సభ చూసిన తరువాత రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో 65 మంది ఎమ్మెల్యేలు గెలుస్తారు. సీపీఎం ఒకటి, భాజపా ఎనిమిది, ఎంఐఎం ఆరు లేదా ఏడు సీట్లు, మిగిలినవి కేసీఆర్, ఆయన భజనపరులు గెలుస్తారని చెప్పాను. డిసెంబరు ఫలితాల్లో కాంగ్రెస్ 64, సీపీఐ ఒక సీటు గెల్చుకుంటే, ఆ తరువాత ఉప ఎన్నికల్లో రెండు సీట్లు ఇచ్చారు. నాడు నేను చెప్పిన జోస్యం ఫలించింది. తరువాత పార్లమెంటు ఎన్నికల్లో భారాసకు గుండు సున్నా వస్తుందన్నాం.. అదే నిజమైంది. పంచాయతీ ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ, పురపాలిక ఎన్నికల్లో 80 నుంచి 90 శాతం గెలిచి చూపించాం. కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో బంధించాం. ఆయనకు విముక్తి లేదు.

*** మేడిగడ్డ నింపితే భద్రాద్రి రాముడే ఉండడు**

మొన్న కేటీఆర్ కన్నెపల్లికి వెళ్లారు.. మేడిగడ్డలో నీళ్లు నింపండి కన్నెపల్లి ఎత్తాలి అంటున్నారు. ఒకవేళ మేడిగడ్డ గేట్లు దించి నీళ్లు నిలబెడితే మేడిగడ్డ ఇప్పటికే కుంగిపోయింది. రేపు తెగిపోతే భద్రాద్రి రాముడే ఉండడు. 44 గ్రామాలు మునిగిపోతాయి. మీ రాజకీయాల కోసం మేడిగడ్డ నింపి భద్రాచలం కొట్టుకుపోయేలా చేయాలా అని అడిగితే మాట లేదు. మరుసటి రోజు హరీశ్‌రావు వచ్చారు. బావబావమరిది మమ్మల్ని ఓడిస్తామని అంటున్నారు. భారాస గెలుస్తుందని సర్వే తేలినట్లు వారంటున్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయో, ఏ రిజర్వేషన్ ఉంటుందో, ఎవరు పోటీ చేస్తారో తెలియకుండా ఎన్ని సీట్లు పెరుగుతాయో తెలియక ముందే సర్వేలు చేస్తారా? జూబ్లీహిల్స్‌లో ఇలాగే గెలుస్తామని, రెఫరెండం అని చెప్పారు. కానీ, ప్రజలు భారాసను తిరస్కరించి.. నవీన్ యాదవ్‌ను గెలిపించారు. రెండోసారి భారాస ప్రభుత్వం ఏర్పడినప్పుడు హరీశ్‌ను మంత్రిని చేయడానికి ఏడాది పట్టింది. అప్పుడే ఆయనను పార్టీ నుంచి పంపాలని చూశారు. కన్నెపల్లికి వెళ్లినప్పుడు కేటీఆర్.. హరీశ్‌రావును వెంట తీసుకెళ్లలేదు. సన్నబియ్యం తిన్నవారు, ఇందిరమ్మ ఇళ్లు పొందినవారు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ఆడబిడ్డలు, ఉద్యోగాలు పొందినవారు మాకు ఓట్లు వేస్తే భారాసకు డిపాజిట్లు కూడా దక్కవు'' అని రేవంత్ పేర్కొన్నారు.

*** రాహుల్‌ను ప్రధానిని చేద్దాం**

''ఈ నెల 20వ తేదీ తరువాత దిల్లీకి వెళ్లి ఖర్గే, రాహుల్‌లను కలుస్తా. ఈసారి రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామా? రాబోయే ఎన్నికల్లో 20కి పైగా ఎంపీ సీట్లలను గెలిపిద్దామా? 117 మంది ఎమ్మెల్యేలను గెలిపిద్దామా? సిద్ధమేనా'' అని సభికులను ముఖ్యమంత్రి అడిగారు. అందుకు జనం చేతులెత్తి మద్దతు పలికారు. ఔర్ ఏక్‌బార్ కాంగ్రెస్ సర్కార్.. అంటూ పెద్దఎత్తున నినదించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిర నియోజకవర్గానికి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారు. అనంతరం మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించిన రూ.3504 కోట్ల విలువైన చెక్కును రైతులకు పంపిణీ చేశారు. ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో జరిపిన భూధార్ సర్వేకు సంబంధించి గ్రామస్థులకు డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకాలు అందించారు.

## ఒకరికి మించి భార్యలుంటే ప్రభుత్వ ఉద్యోగం ఊస్ట్

బహుభార్యత్వంపై అసోం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది భార్యలు ఉన్నవారికి ఇకపై ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవని స్పష్టం చేసింది. అంతేకాకుండా, బహుభార్యత్వం పాటిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ప్రవేశపెట్టిన 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు చేసింది. అసోం ఆర్థిక మంత్రి జయంత మల్లా బారువా శుక్రవారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బహుభార్యత్వం పాటిస్తున్న ఏ పురుషుడైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు అనర్హుడవుతారని ఆయన సభకు వెల్లడించారు. మహిళా సాధికారత, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీనికోసం 'అసోం సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ అప్పీల్) రూల్స్ 1964'కు సవరణలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సైతం ఒక మీడియా సమావేశంలో ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. బహుభార్యత్వాన్ని అరికట్టేందుకు అసోం ప్రభుత్వం గత కొంతకాలంగా కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా 2025 నవంబర్‌లోనే "అసోం బహుభార్యత్వ నిషేధ బిల్లు, 2025"ను అసెంబ్లీలో ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం, మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకోవడం నేరం. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అయితే, కొన్ని షెడ్యూల్డ్ తెగలకు, ఆరో షెడ్యూల్ ప్రాంతాలకు ఈ చట్టం నుంచి మినహాయింపు కల్పించారు.

## స్టీవ్ వాకు మోదీ ప్రత్యేక కానుక

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో ఆ దేశ క్రికెట్ దిగ్గజం స్టీవ్ వాకు ఓ అరుదైన కానుకను అందజేసి ఆశ్చర్యపరిచారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తామిద్దరూ తొలిసారి కలుసుకున్నప్పటి మధుర స్మృతిని గుర్తు చేస్తూ, ఆ ఫొటోను ఫ్రేమ్ చేయించి శుక్రవారం ఆయనకు బహూకరించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)ను సందర్శించిన సందర్భంగా ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీవ్ వా ఆయనతో భేటీ అయ్యారు. ఆనాటి స్మృతులను నెమరువేసుకుంటూ ప్రధాని మోదీ అందించిన ఈ వ్యక్తిగత బహుమతికి స్టీవ్ వా మంత్రముగ్ధులయ్యారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు యువ క్రీడాకారులతో సంభాషించారు. క్రికెట్, కబడ్డీ, ఆస్ట్రేలియన్ ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న అథ్లెట్లను వారు ఉత్సాహపరిచారు. ఇదే వేదికపై 'భారత్‌ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్'ను కూడా ఆవిష్కరించారు. ఈ పర్యటన సందర్భంగా క్రికెట్ ప్రేమికులకు మరో తీపి కబురు అందింది. 2026-27 బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) సీజన్ ప్రారంభ మ్యాచ్‌ను చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో నిర్వహించనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. డిసెంబర్ 12న మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ఈ పోరు సాగనుంది. ఆస్ట్రేలియా గడ్డ వెలుపల బీబీఎల్ మ్యాచ్ నిర్వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## అయ్యప్పస్వామికి పబ్లిసిటీ అవసరం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భాగంగా గతంలో వివాదాస్పదంగా మారిన 'అయ్యప్ప సంగమం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. 'అయ్యప్ప స్వామికి ఎలాంటి ప్రచారం అవసరం లేదు' అని బోర్డు అధ్యక్షుడు కె. జయకుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నవంబర్ మధ్యలో ప్రారంభమయ్యే రెండు నెలల యాత్ర సీజన్‌కు ముందే ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. నూతన సంస్కరణల ప్రకారం భక్తులకు అందించే సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. రద్దీని పర్యవేక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. వసతి గదుల ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని బోర్డు భారీగా విస్తరించింది. సన్నిధానంలోని మొత్తం 690 గదుల్లో ఇకపై 550 గదులను భక్తులు ఆన్ లైన్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. గతంలో ఈ సంఖ్య కేవలం 190గా మాత్రమే ఉండేది. గదుల బుకింగ్‌కు సెక్యూరిటీ డిపాజిట్ విధానాన్ని రద్దు చేసి, కేవలం అద్దెతో పాటు నామమాత్రంగా రూ.50 సర్వీస్ ఛార్జిని మాత్రమే వసూలు చేయనున్నారు. భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు సన్నిధానంతో పాటు బోర్డు ప్రధాన కార్యాలయంలో ఏఐ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

## తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలం

హైదరాబాద్: తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ అత్యున్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బవేరియన్ (జర్మనీ) మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ ఎఫైర్స్, రీజినల్ డెవలప్‌మెంట్ అండ్ ఎనర్జీ వైస్ మినిస్టర్ టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ భేటీలో 'తెలంగాణజర్మనీ' ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు, పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి వివరించారు. 'తెలంగాణజర్మనీ' భాగస్వామ్యాన్ని పెట్టుబడులకు మాత్రమే పరిమితం చేయకుండా.. సాంకేతికత, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాలకూ విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది'' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ ఈడీ ఉల్రికే హాఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయం ఈడీ జాన్ కొట్టాయిల్, తెలంగాణ లైఫ్‌సైన్సెస్ డైరెక్టర్ సర్వేశ్‌సింగ్, ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే.. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. "వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి" అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

## డిజిటల్ టికెట్లపై కొత్త నిబంధన..రైల్వే శాఖ కీలక ప్రకటన

భారతీయ రైల్వే శాఖ డిజిటల్ అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల విషయంలో ప్రయాణికులకు కీలక స్పష్టతనిచ్చింది. 'రైల్ వన్' యాప్ ద్వారా బుక్ చేసుకున్న డిజిటల్ టికెట్లను ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బుకింగ్ చేసిన మొబైల్ ఫోన్‌లోనే చూపించాలని స్పష్టం చేసింది. టికెట్ స్క్రీన్‌షాట్లు, పీడీఎఫ్ కాపీలు లేదా వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫార్వార్డ్ చేసిన కాపీలు చెల్లవని తేల్చి చెప్పింది. వీటిని ప్రయాణానికి సరైన ఆధారాలుగా పరిగణించబోమని రైల్వే అధికారులు వెల్లడించారు. డిజిటల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జూలై 8న తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. ఇటీవల ఓ ప్రయాణికుడు వాట్సాప్ స్క్రీన్‌షాట్ చూపించగా, అధికారులు అతడికి జరిమానా విధించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రయాణికులు రైలు బయలుదేరక ముందే టికెట్ బుక్ చేసుకోవాలని, ప్రయాణ సమయంలో టికెట్ బుక్ చేసిన ఫోన్‌తో పాటు తప్పనిసరిగా అసలు గుర్తింపు కార్డును వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. అయితే, రైల్వే శాఖ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులందరికీ ఒకరే టికెట్లు బుక్ చేసే సందర్భాల్లోనూ, సాంకేతిక పరిజ్ఞానం లేని వృద్ధుల ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే సాధకబాధల గురించి పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసిన వ్యక్తి ప్రయాణంలో లేకపోతే ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఆందోళనలపై రైల్వే శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## ఆధార్ ధ్రువీకరణతో.. ఇంటి నుంచే 100 రవాణా సేవలు

హైదరాబాద్: ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగడం.. గంటల తరబడి లైనుల్లో నిలబడటం.. వాహన యజమానులు, డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్టు యజమానులు ఇప్పటివరకు ఎదుర్కొంటున్న ప్రధానమైన ఇబ్బందులివీ.. ఇక ఈ వ్యయప్రయాసలకు స్వస్తి చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆధార్ ధ్రువీకరణతో 100 రవాణా సేవల్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చేలా తాజాగా కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణాశాఖ కూడా దశలవారీగా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్లు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు సంబంధించిన సేవల్ని ఆన్‌లైన్‌లో అందించేలా హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయ పరిధిలో పైలట్ ప్రాజెక్టును వారం రోజుల్లో చేపట్టనుంది. తర్వాత నెల, రెండునెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. పరివాహన్, సారథి, ఈచలాన్ పోర్టల్ల ద్వారా.. ఆధార్ ధ్రువీకరణతో 100 సేవలకు కేంద్రం అనుమతించింది. ఆధార్ లేనివారికి ఇతర చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రాలతో సంబంధిత రవాణాశాఖ కార్యాలయంలో సేవలు పొందొచ్చు. తెలంగాణలో ఇప్పటికే కార్లు, ద్విచక్రవాహనాలు వంటి వ్యక్తిగత(నాన్ ట్రాన్స్‌పోర్ట్) కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు షోరూంల ద్వారా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. మిగతా విభాగాలు ఆటోలు, లారీలు వంటి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్లు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు సంబంధించిన వివిధ సేవలను..అదేవిధంగా నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల సేవలను ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయ పరిధిలో వారంలో అమలు చేయనున్నట్లు ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

**ఏయే సేవలంటే..**

డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్‌నెస్ వంటి పరీక్షలు రోడ్డు భద్రతకు సంబంధించినవి కావడంతో వాటికి మాత్రం రవాణాశాఖ కార్యాలయాలకు వెళ్లడం తప్పనిసరిగా ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించి 23 రకాల సేవల్ని రవాణాశాఖ ఇటీవల ఆన్‌లైన్‌లో ప్రారంభించినప్పటికీ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్లు..తదితరాలకు సంబంధించిన 100 సేవలను కేంద్రం 9 విభాగాలుగా విభజించింది.

* లైసెన్స్‌లో 21 రకాలు: కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ, లైసెన్స్ రెన్యువల్, లైసెన్స్‌లో అడ్రస్, పేరు మార్పు, డూప్లికేట్ లైసెన్స్, అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్, మొబైల్ నంబరు మార్పు, స్మార్ట్ కార్డ్, లైసెన్స్ సరెండర్ చేయడం.

* పబ్లిక్ సర్వీస్ వెహికిల్ బ్యాడ్జ్ 2 సేవలు: ఆటో, క్యాబ్ వంటి ప్రజారవాణా వాహనాలు నడిపే డ్రైవర్లకు కొత్త బ్యాడ్జ్, డూప్లికేట్ బ్యాడ్జ్ జారీ

* కండక్టర్ లైసెన్స్ 6 సేవలు: కండక్టర్ లైసెన్స్ జారీ, లైసెన్స్ రెన్యువల్, చిరునామా మార్పు, పేరు మార్పు, డూప్లికేట్ లైసెన్స్, లైసెన్స్ ఎక్స్‌ట్రాక్ట్

* వాహన రిజిస్ట్రేషన్ 39 సేవలు: పాత వాహన యాజమాన్య బదిలీ, కొత్త వాహన రిజిస్ట్రేషన్, తాత్కాలిక రిజిస్ట్రేషన్, డూప్లికేట్ ఆర్సీ, ఎన్వోసీ, చిరునామా, పేరు మార్పు, హైపోథకేషన్ చేర్చడం.. తొలగించడం, మోటారు వాహన పన్ను రిఫండ్ తదితర సేవలు

* పర్మిట్ సేవలు 17: తాత్కాలిక పర్మిట్, స్టేజ్ క్యారేజ్, కాంట్రాక్ట్ క్యారేజ్, టూరిస్ట్ పర్మిట్, ఆలిండియా టూరిస్ట్ పర్మిట్, నేషనల్ పర్మిట్, పర్మిట్ బదిలీ తదితర సేవలు

## విద్యా సంస్థల బంద్ సక్సెస్

*** సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవు**




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ కొత్తగూడెం జిల్లాలో పూర్తిగా సక్సెస్ అయింది .ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించగా, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపారు . ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు వరక అజిత్, మంద నాగకృష్ణ, బుర్రి వీరభద్రం, దుర్గం ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టబడుతోందని , మూడు సంవత్సరాలుగా రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని , ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు సమగ్ర చట్టం తీసుకురావాలని , స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు..ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని భారీ ఉద్యమాలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో మాణిక్యాల వినయ్, కొరిమి సంజయ్, సాయి సంతోష్, గుగులోత్ వీరభద్రం, విఘ్నేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామచంద్ర స్వామి రథ కైంకర్యానికి రూ.2 లక్షల అందజేత



లింగాల ఘణపురం/ జనగామ, ప్రజా స్ఫూర్తి : శ్రీ వీరాచల జీడికంటి శ్రీరామ చంద్ర స్వామివారి దివ్య విమాన రథో త్సవం సందర్భంగా రథ కైంకర్య దాత లైన సంపంగి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో వడ్రంగి కొండోజు శంకరయ్యా చారికి శుక్రవారం, రూ.2,00,000 నగ దు అందజేశారు. ముందు తొలి విడత గా రూ.1,16,000 అడ్వాన్స్‌ను అంత కుముందే అందజేసినట్లు తెలిపారు.ఈ నగదును ఆలయ కార్యనిర్వహణాధికా రి వంశీ, ఆలయ మాజీ చైర్మన్ యేలె న రసింహమూర్తి,ఆలయ సిబ్బంది కె. భర త్, అర్చకులు భార్గవాచార్యులు చేతు ల మీదుగా అందజేశారు. రథ నిర్మాణ పనులు నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించి నట్లు వారు తెలిపారు.

## చర్లపెల్లి చేనేత సహకార సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : చర్లపల్లి చేనేత సహకార సంఘానికి శుక్రవారం జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. హోరా హోరీగా సాగిన ఎన్నికలలో ముషం రవి చైర్మన్, గంజి రమేష్, సిరిపోలు రమేష్,కటకం వెంకటేష్, రాపోలు గణేష్, రాపోలు శేషమ్మ, గంజి వెంకమ్మ, గంజి రమేష్, లు కాంగ్రెస్ పార్టీ నుండిఘనవిజయం సాధించగా టిఆర్ఎస్ పార్టీకి చెందిన రాపోలు బిక్షంలు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ డైరెక్టర్లను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్గా ఎన్నికైన ముషం రవి మాట్లాడుతూ చేనేత సహకార సంఘం పటిష్టపరిచి చేనేత కార్మికులకు ప్రభుత్వము నుండి రావలసిన బెన్ఫిట్ లను అందజేయడానికి విచ్చేస్తామని కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు.

## ఎస్ కే టి గ్రూప్స్ ఆధ్వర్యంలో రిజిస్టార్ కార్యాలయం కు కుర్చీలు వితరణ




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గల ఎస్ కే టి గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరరావు బ్రదర్స్ , దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో గల సబ్ రిజిస్టార్ కార్యాలయముకు కుర్చీలు అందజేశారు . ఈ సందర్భంగా దోసపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సబ్ రిజిస్టార్ కార్యాలయముకు పని మీద వచ్చే ప్రజలు కూర్చోవడానికి ఇబ్బందులు లేకుండా వారికి అనుగుణంగా కూర్చోవడానికి కుర్చీలు అందజేస్తున్నామని ఆయన అన్నారు. కుర్చీలు అందజేయడం పట్ల సబ్ రిజిస్టార్ నూతలపాటి అప్పారావు వారిని అభినందించారు . ఈ కార్యక్రమంలో దోసపాటి పిచ్చేశ్వరరావు , దోసపాటి క్రాంతి , ఎస్ కే టి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టాలి

*** ప్రిన్సిపాళ్లు, మాస్టర్ ట్రైనర్ల శిక్షణలో కలెక్టర్ కె. హరిత**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారి ప్రతిభను ప్రోత్సహించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ కె. హరిత సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు, వారి ఆలోచనా శక్తి, సృజనాత్మకత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా, సబ్జెక్టులపై ఆసక్తి పెరిగే విధంగా వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు ఉపాధ్యాయులే రుచి చూసి, నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. ఇంట్లో పిల్లలకు అందించే ఆహారం మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కూడా మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సూర్యాపేటను సస్యశ్యామలం చేసింది జలయజ్ఞమే



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందని, రూ. 8.20 లక్షల కోట్ల మేర ఆర్థిక విధ్వంసం సృష్టించారని పర్యటన అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ధ్వజమెత్తారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని కొనియాడారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నెలల తరబడి వేచి చూసేలా చేసిందని, కానీ రేవంత్ సర్కార్ రాగానే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ నేతలు ఏటీఎంలా వాడుకున్నారని రమేష్ రెడ్డి మండిపడ్డారు. రూ. 1.27 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా కొత్తగా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు.50 టీఎంసీలు కూడా ఎత్తిపోయలేని ప్రాజెక్టు కోసం రూ. 33 వేల కోట్ల అప్పులు కట్టాల్సి వస్తోందని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజ్ నింపితే చుట్టుపక్కల గ్రామాలకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్కో నియోజకవర్గంలో 3 వేల ఇందిరమ్మ ఇళ్లను రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని రమేష్ రెడ్డి చెప్పారు. 10 ఇళ్లు కూడా కట్టని బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు.

*** బావ-బామ్మర్దులవి గ్లోబల్ అబద్ధాలు**

హరీష్ రావు, కేటీఆర్‌లను 'బిల్లా రంగ'లతో పోల్చిన రమేష్ రెడ్డి.. వారిద్దరూ పోటీ పడి మరి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని విమర్శించారు. 3 వారాల సమయం ఇస్తే ప్రాజెక్టును బాగు చేస్తానంటున్న హరీష్ రావు, గత 9 ఏళ్లుగా ఏం చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి వేల ఎకరాల్లో ఫామ్ హౌస్ లు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం పై చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, నేరెళ్ళ మధు, వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, దర్మా నాయక్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలి

*** కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఎస్ఐఆర్ లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ క్షేత్రస్థాయిలో సర్ నిర్వహణ పై ఆర్డీవోలకు తాసిల్దారులకు గూగుల్ మీట్ ద్వారా ఆమె సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను జిల్లాలో పారదర్శకంగా చేపట్టాలని ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు ఇప్పటి వరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయ్యింది, ఓటర్లు అందరికీ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తయిందా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం అందించాలని, గడువు లోపు వారు తమ ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి అందించేలా చూడాలన్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఎన్యూమరేషన్ ఫారంలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకోవచ్చని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ను ఏకకాలంలో సమాంతరంగా నిర్వహించాలని అన్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఓటరు మ్యాపింగ్ విషయంలో సహకారం అందించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ దగ్గర ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తిస్తూ, ఓటరు జాబితాలో మార్కింగ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఓ లకు తగిన సహకారం అందించాలని అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, ఎన్నికల సూపరింటెండెంట్ గఫార్, ఆర్డీవోలు, తాసిల్దారులు ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.




## విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం

*** ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ ఐ,పిడిఎస్ యు విద్యార్థి సంఘాల నాయకులు.**

ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : శుక్రవారం నల్లగొండ పట్టణంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ,ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్,పిడి ఎస్ యు జిల్లా కార్యదర్శి పవన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని,కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలు నుండి విద్యాశాఖకు మంత్రి పదవి కేటాయించకుండా ముఖ్యమంత్రి దగ్గర ఉంచుకోవడం దుర్మార్గమని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేల పాఠశాలలకు తగ్గిస్తామని చెప్పడం పేద విద్యార్థులకు అన్యాయం చేయడం అని అన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న నాలుగు సంవత్సరాల ఫీజురియంబర్స్మెంట్ ,స్కాలర్షిప్ లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ప్రైవేటపాఠశాలలో,జూనియర్ కళాశాలలో విచ్చలవిడిగా ఫీజులు పెంచారని ,ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలలో ఇస్తాను రాజ్యాంగ పుస్తకాలు, యూనిఫామ్, డైరీలు అమ్ముతున్నారని, విద్యార్థుల సొమ్ము దోచుకు తింటున్నారని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రించకపోతే, దాడులు చేస్తామని హెచ్చరించారు.ఈ బంద్ లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాదేపాక సూర్య తేజ,పివైఎల్ రాష్ట్ర నాయకులు సాగర్,యం డి,సోయల్,బి వి చారి,డి.సంతోష్,హరి కృష్ణ, రావుల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ వద్ది రాజు నిధులతో సుజాతనగర్ కబ్రస్థాన్ ప్రహరీ కు నిధులు మంజూరు

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో 22వ డివిజన్ సుజాతనగర్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అభ్యర్థిగా గత ఎన్నికలలో పోటీ చేసిన చింతలపూడి పార్వతి జగన్ దంపతులు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లిం సోదరులు కు కబరస్థాన్ కు పహరిగోడ నిర్మాణం చేపడతామని ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలలో ఓడినా చింతలపూడి దంపతులు ప్రహరీ గోడకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నిధులతో పది లక్షల రూపాయలు మంజూరు చేయించి మాట నిలబెట్టుకున్నారు .. నిధులు మంజూరు చేసిన లేఖను ముస్లిం మత పెద్దలకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. వారం రోజుల్లో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని ముస్లిం సోదరులకు తెలిపారు. సుజాతనగర్ మండల బిఆర్ఎస్ పార్టీ , ముస్లిం పెద్దలు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో సుజాతనగర్ మసీద్ ముతవల్లి, ముస్లిం పెద్దలు డాక్టర్ అనీష్ , పార్టీ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ , నరేంద్ర ప్రసాద్, జగన్, చంటి, బాబా, బనగీ సాబ్, షర్ఫుద్దీన్, ప్రదీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలి

*** జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని డైట్ కళాశాలలో ఆంగ్ల భాషోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ 1 శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలుపరుస్తూ విద్యార్థుల యొక్క ఆంగ్ల భాషా నైపుణ్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేసి, సమర్ధవంతమైన అభ్యాసకులుగా తయారు చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి సామాజిక స్థితిగతులు అన్నింటినీ పరిగణలోకి తీసుకొని వారి పట్ల సహానుభూతితో వారి వైయక్తిక విభేదాలను దృష్టి యందుంచుకొని అందుకు అనుగుణంగా విద్యాబోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు గారు, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్ డైట్ ప్రిన్సిపాల్ నరసింహ , సెంటర్ ఇంచార్జ్ రఘుపాల్ రెడ్డి రిసోర్స్ పర్సన్ లు అనురాధ, విష్ణు, శ్రీనివాస్, ఉమాశంకర్, సత్యనారాయణ, శ్రీధర్ లు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బిజెపి పార్టీలో చేరికలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బిజెపి జాతీయ పార్టీ, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీని బలపరితం చేయాలి. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పార్టీ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అట్టడుగు వర్గాలకు, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు చేరుతుందని నేడు బిజెపి పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఉమ్మడి ఆమనగల్ గ్రామపంచాయతీలోని బలరాం తండా నుండి వివిధ పార్టీలకు కార్యకర్తలు సుమారుగా 100 మంది బిజెపి పార్టీలో చేరడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు, ధారావత్ శీను, మానుకోట రూరల్ అధ్యక్షులు జహీందర్ నాయక్, సుధీర్, లక్ష్మణ్, వెంకన్న,వీరన్న,భద్రు, వస్రు,రాజు, ఉపేంద్ర, మోహన్,అనిల్, పద్మ. తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్

* **విద్యా శాఖ అధికారుల, పోలీసుల ఆధ్వర్యంలో 20 మంది పిల్లలు బడి బాట..**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : బూర్గుల గ్రామ పరిధిలో పోలీసుల ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా వలస కార్మికుల 20 మంది పిల్లలను గుర్తించి పరిశ్రమ దెగ్గర్లోని కాశిరెడ్డి గూడా గ్రామ పాఠశాల కు అధికారులు తరలించారు.పోలీసులు, ఎస్ ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.... బీహార్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రల నుండి వలస వచ్చిన కార్మికులు పనికి వెళ్ళగానే వారి పిల్లలు పాఠశాల ల కు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా పోలీసులు కార్మికులతోపాటు వారు పనిచేసే పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. వలస కార్మికులు ప్రతిరోజు పాఠశాలకు పిల్లలని విధిగా పంపిస్తామని తెలిపారు. యజమాన్యం సైతం పిల్లల కోసం ఆటోను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# జనసేన పార్టీలో చేరిన అడ్వకేట్ రవి వర్మ



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్నగర్ డివిజన్ వెర్టెక్స్ ప్రైమ్ కు చెందిన న్యాయవాది రవి వర్మ, శుక్రవారం జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో హైదరాబాద్లో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ, పారదర్శక పాలన, రాజ్యాంగ విలువల పరిరక్షణ, యువత సాధికారత వంటి అంశాల్లో జనసేన పార్టీ అవలంబిస్తున్న విధానాలు తనను ఆకర్షించాయని తెలిపారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, సమాజాభివృద్ధికి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ వేదికగా చురుకుగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి, చేరికల కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్, ప్రజీత్ గౌడ్, తనీష్, సీనియర్ నాయకులు రాజ లింగం, రామ కృష్ణ, సాగర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ వేగ వంతం చేయాలి

* **డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి 24 వ తేది లోపు పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించగా, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పనితీరు, పేర్ల నమోదు,తొలగింపు,సవరణ లను ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా, అనర్హులు చేరకుండా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం పూర్తైందని, డిజిటలైజేషన్ ప్రక్రియ 21. 94 శాతం పూర్తైందని తెలిపారు. మిగిలి న ఫారాల పంపిణీని పూర్తి చేసి డిజిట లైజేషన్ను మరింత వేగవంతం చేస్తా మని అన్నారు.

# భూపాలపల్లిలో 11న 'స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' శిక్షణ కార్యక్రమం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్" మొబైల్ శిక్షణ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 3 గంటలకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి సీహెచ్ రఘు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం, క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడం, ఆధునిక శిక్షణా విధానాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర స్థాయి కోచ్లు, క్రీడా నిపుణులు, ప్రముఖ ఫిజియోథెరపిస్టులు పాల్గొని ఆధునిక క్రీడా నైపుణ్యాలు, ఫిట్నెస్ సూత్రాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు ,ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరైన వారికి ఆ రోజును *ఆన్ డ్యూటీ గా పరిగణిస్తామని పేర్కొన్నారు.అలాగే వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

* **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్పాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, పాఠశాల సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ



పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్యార్థులకు టిఫిన్, మధ్యాహ్నభోజనం, స్నాక్స్ అందిస్తూ మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, గ్రామం, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. డాక్టర్లు, సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులు వంటి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గాంధీనగర్ గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఏడాదిలోగా ఇంజనీరింగ్ కళాశాల భవనం పూర్తి చేస్తాం

* **మంత్రులు పొన్నం ప్రభాకర్ వివేక్ వెంకటస్వామి.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ గ్రామంలో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల భవనానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ వివేక్ వెంకటస్వామి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మొదటి సంవత్సరం పూర్తిచేసుకుని రెండవ సంవత్సరం ప్రారంభం అయ్యేలోపు భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఏడాదిలోపు భవనాలను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. 15 కోట్ల వ్యయంతో విద్యార్థిని,విద్యార్థులకు హాస్టల్ భవనాలను కూడా నిర్మాణానికి అనుమతులు వచ్చాయని త్వరలో శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్ విద్యను బలోపేతం చేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని విద్య హబ్ గా మార్చేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు లాప్టాప్ లు సైకిలను కూడా అందించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇతర ఇంజనీరింగ్ కళాశాలతో సమానంగా శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో నాణ్యమైన విద్యా ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మున్నూరు కాపు రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్,శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి,ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, ఉమ్మాపూర్ గ్రామ సర్పంచ్ చొప్పరి ప్రశాంత్ స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ సోకిన వారు భయపడవద్దు.. క్రమం తప్పకుండా మందులు వాడాలి

* **జిల్లా కలెక్టర్, బి చంద్రశేఖర్**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ఎయిడ్స్ సోకినవారు భయపడకుండా క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గతంలో ఎయిడ్స్ వ్యాధి సోకినవారు చనిపోయేవారని, కానీ ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులు,మెరుగైన వైద్య చికిత్సలతో పరిస్థితులు మెరుగయ్యాయని తెలిపారు.శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని రెడ్ క్రాస్ సొసైటీలో నేస్తం సొసైటీ ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ వైజాగ్ మరియు దాతల సహకారంతో హెచ్ఐవి తో సోకిన విద్యార్థులకు నోటు పుస్తకాలు బ్యాగులను పంపిణీ చేశారు. ఎయిడ్స్ వచ్చిన వారిని ముట్టుకున్న హెచ్ఐవి రాదని, అది అపోహని మాత్రమే అని కలెక్టర్ అన్నారు. సమాజంలో ఎయిడ్స్ పై వచ్చిన అవగాహనతో పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చిందని, అయితే ఎయిడ్స్ సోకిన వారు ఇతరులకు సోకకుండా క్రమం తప్పకుండా మందులు వాడాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రభుత్వం తరపున హెచ్ఐవి పట్ల అవగాహన కల్పిస్తున్నామని,అంతేకాక వ్యాధి సోకిన వారికి చికిత్స తో పాటు,ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేస్తం సొసైటీ ఫౌండర్ వెంకన్న, జిజిహెచ్ డిప్యూటీ సూపరింటిండెంట్ నగేష్,ఏ ఆర్ సెంటర్ హెచ్ ఓ డి డాక్టర్ స్వరూప రాణి, డెర్మటాలజీ హెచ్ ఓ డి డాక్టర్ నరసింహారావు నేత, ఎన్సిడి ప్రాజెక్టు ఆఫీసర్ జమీర్, డాక్టర్ మల్లిక, జలీల్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు కోట్లతో నైన్పాక–నేరేడుపల్లి బ్రిడ్జి.. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : చిట్యాల మండలంలోని నైన్పాక-నేరేడుపల్లి మధ్య నిర్మిస్తున్న వంతెన పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నైన్పాక-నేరేడుపల్లి మధ్య వంతెన లేకపోవడంతో ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.4 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. అవసరమైతే మరిన్ని నిధులు కూడా తీసుకొచ్చి పనులు ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాశ్వత ప్రయోజనం కలిగే విధంగా నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ బ్రిడ్జి పూర్తయితే నైన్పాక, నేరేడుపల్లి, వజీనా పల్లి, గొర్లవీడు, జంగేడు, కొంపెల్లి, కాసింపల్లి, గిద్దముత్తారం, బోర్నపల్లి, వెలిశాల తదితర గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రానికి చేరుకునే దూరం తగ్గి రాకపోకలు మరింత సులభమవుతాయని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు.

# విద్యార్థులు ఈ-పాస్ దరఖాస్తుల్లో జాగ్రత్తలు పాటించాలి

* **2026–27 విద్యా సంవత్సరానికి ఫ్రెష్, రెన్యూవల్ స్కాలర్షిప్ల నమోదు ప్రారంభం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన బీసీ, ఈబీసీ విద్యార్థుల ప్రీమెట్రిక్, పోస్ట్మెట్రిక్ స్కాలర్షిప్లు (ఫ్రెష్, రెన్యూవల్) దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎఫ్. చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసే ముందు విద్యార్థులు కొన్ని అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. డీబీటీ ద్వారా స్కాలర్షిప్ జమ కావాలంటే బ్యాంకు ఖాతాకు ఎన్పీసీఐ మ్యాపింగ్ పూర్తి చేసి, ఆధార్తో బ్యాంకు ఖాతా అనుసంధానం చేసి ఉండాలని తెలిపారు. ఆధార్లోని పేరు, జనన వివరాలు బ్యాంకు ఖాతాలోని వివరాలతో సరిపోలేలా చూసుకోవాలని సూచించారు.అలాగే ఈపాస్ పోర్టల్లో డెమో అథెంటికేషన్ విజయవంతంగా పూర్తి కావడంతో పాటు, విద్యార్థి మొబైల్ నంబర్, ఈమెయిల్ వివరాలు సరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఫ్రెష్ లేదా రెన్యూవల్ దరఖాస్తు ఎంపికలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల అర్హత, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తులను సకాలంలో ఆన్లైన్లో ధృవీకరించాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు. స్కాలర్షిప్లకు అర్హులైన విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకుని, అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో సమర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎఫ్. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.


# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




జయశంకరగ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చెందిన నియోజకవర్గాల సరసన నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం చిట్యాల మండలంలోని ఏలేటి రామయ్యపల్లి, జడలపేట, బౌసింగ్పల్లి, నైన్పాక, అందుకు తండా, కాల్వపల్లి, వోడితెల గ్రామాల్లో రూ.2.26 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, మౌలిక వసతుల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ,ప్రజాస్ఫూర్తి : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లోని ఈవీఎం గోదాంను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని మాపక భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశా రు. ఈవీఎం గోదాం వద్ద భద్రతా ప్రమా ణాలను కట్టుదిట్టంగా అమలు చేయా లని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, ఎన్ని కల సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరు లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందచేత




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి పట్టణంలోని 23వ వార్డు ఇందిరా నగర్కు చెందిన బండారు లింగం కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 28500 చెక్కును శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మున్సిపల్ కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రెజహంగీర్ అందజేశారు ఈ సందర్భంగా పూజిత జహంగీర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని వారన్నారు అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు చెక్కు అందుకున్న లింగం కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డికి పూజిత జాంగిర్లకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో నాయకులు బండారు రవివర్ధన్ బర్రె క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# 9, 10వ తరగతి బీసీ విద్యార్థులకు శుభవార్త

**ప్రీ-మెట్రిక్ స్కాలర్షిప్కు దరఖాస్తుల ఆహ్వానం.**

**ఏడాదికి రూ.4 వేల ప్రోత్సాహకం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. 9వ, 10వ తరగతులు అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్షిప్ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.4,000 చొప్పున ప్రోత్సాహక నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పాఠశాలల ద్వారా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులందరూ గడువులోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని పొందాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**: ఎన్నికల సంఘం**







జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను ఈ నెల 24లోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల జాబితాలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వేలు, పేర్ల నమోదు, సవరణ, తొలగింపు ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం, డిజిటలైజేషన్ 21.94 శాతం పూర్తయ్యిందన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.52 శాతం, డిజిటలైజేషన్ 37.36 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఈ నెల 24లోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, తహసీల్దార్ల పర్యవేక్షణలో పనులు వేగవంతం చేస్తామని చెప్పారు.

## రఘునాథపల్లిలో దొంగల బీభత్సం

*** వ్యవసాయ బావుల నుంచి కాపర్ వైర్ల చోరీ.**



జనగామ/రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని రఘునాథపల్లి మండల కేం ద్రంలో వరుస దొంగతనాలు ప్రజలను, ముఖ్యంగా రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దాదాపు ప్రతి వారం ఏదో ఒకచోట చోరీ ఘటనలు చోటుచేసుకుం టున్నాయి. గత గురువారం బైక్‌తో పా టు ట్రాక్టర్ ఇంజిన్ ఆయిల్ చోరీ ఘటన మరువకముందే మరో దొంగతనం వెలు గుచూసింది.శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఖిలాషాపురం రోడ్డులోని దూకిరే మహేందర్,పేర్ని ఐల య్య లకు చెందిన వ్యవసాయ క్షేత్రాల వద్ద అమర్చిన కాపర్ వైర్లను గుర్తు తెలి యని దుండగులు అపహరించారు. ఈ ఘటనలతో రైతులు తీవ్ర ఆందోళన వ్య క్తం చేస్తూ, వరుస దొంగతనాల పై పోలీ సులు ప్రత్యేక దృష్టి సారించి నిందితుల ను త్వరగా పట్టుకోవాలని, రాత్రి వేళల్లో పోలీసు గస్తీని పెంచాలని ప్రజలు కోరు తున్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడి మృతి



ప్రజాస్ఫూర్తి, జన్నారం : ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జన్నారం మండలంలో చోటుచేసుకుంది. జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం కామనపల్లి తండా కి చెందిన భూక్యా శైలజ భర్త శ్రీనివాస్ యొక్క పిర్యాదు మేరకు ఆమె కొడుకగు భూక్య సాయి విగ్నేష్ s/o శ్రీనివాస్, వయస్సు:10 సం, కులం: లంబాడా, వృత్తి: విద్యార్థి నివాసం : కామనపల్లి తండా అనునతను శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటల ప్రాంతం లో తన స్నేహితుడు తేజవత్ నెహన్ అను అతనితో ఆడుకోవడానికి బయటకు వెళ్లి మధ్యాహ్నం అందాజ 1.30 గంటలకి దగ్గరలో గల తేజవత్ శ్రీనివాస్ యొక్క వ్యవసాయ బావి లో ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోగా గ్రామస్తులు బావి లో నుండి బయటకు తీసి 108 అంబులెన్స్ లో జన్నారం ఆసుపత్రికి కి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుండి లక్షెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో అందాజా 2.30 గంటలకి చనిపోయినాడు అని, అతని తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బాలుడు మృతితో గ్రామంలో విషాదం ఛాయలు అమ్ముతున్నాయి.

## ఎస్.ఐ.ఆర్ హెల్ప్ డెస్క్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: అర్బన్ పరిధిలో ప్రత్యేక సర్ సహాయ కేంద్రలు ఏర్పాటు చేయడమైనదని, అందులో భాగంగా పట్టణంలోని ధరణి ఆసుపత్రి దగ్గరలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులు, సందేహాల నమోదు, పరిష్కార ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సహాయ కేంద్రాలు ఫారం పూరించడంలో మరియు డిజిటలైజేషన్ ప్రక్రియలో సలహా సూచనలు చేయాలని అన్నారు.అధికారులు ఫారం 6, 7, 8 లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని అన్నారు.రోజువారీ వచ్చిన ఫిర్యాదుల వివరాలను ఆన్ లైన్ లో అప్డేట్ చేయాలని అన్నారు."ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అందరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యమని. హెల్ప్ డెస్క్ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి" అని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో తహసీల్దార్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు కృతజ్ఞతలు

**: బంజారా సంఘాల జేఏసీ**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఇటీవల గిరిజన పూజారి భూక్య మంగీలాల్‌పై విచక్షణరహితంగా దాడిచేసిన ఘటనలో కానిస్టేబుల్‌పై జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచనలతో చర్యలకు ఉపక్రమించడంపట్ల బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం బాధితుడు భూక్య మంగీలాల్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాల్వంచలోని తాటిపల్లి విల్లాస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గిరిజన పూజారి భూక్య మంగీలాల్‌పై ఈనెల 4వ తేదీన అదే విల్లాస్‌లో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ సంతోష్ అకారణంగా దాడి చేసి కులంపేరుతో ధూషించి, గాయపరిచిన విషయం విధితమే. ఈ విషయమై జేఏసీ ఆధ్వర్యంలో బాధితుడితో కలిసి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజును కలిసి ఫిర్యాదు చేయగా ఎస్పీ వెంటనే స్పందించినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితుడు సంతోష్‌పై పాల్వంచ పట్టణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు ఇతర పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఘటనా స్థలిని పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వేగంగా స్పందించి బాధితుడి పక్షాన నిలిచిన ఎస్పీకి జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ కార్యదర్శి ధరావత్ కాన్షీరామ్, భూక్యా మంగీలాల్, కట్రం మోహన్ రావు, అశోక్, వెంకట్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు 41 వేలు వేతనాన్ని ఇవ్వాలి

*** సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం లోగల సిడిపిఓ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు 41 వేలు వేతనం,, హెల్పర్లకు 35 వేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ మాట్లాడుతూ ఐ సి డి ఎస్ ప్రాజెక్టును క్రమంగా ఎత్తివేసే ప్రయత్నాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కలిసి ప్రయత్నం చేస్తున్నాయని, గర్భవతులకు, పుట్టిన పిల్లలకు, గర్భంలో ఉన్న శిశువులకు,ఎదుగుతున్న చిన్నారులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ వారి యోగక్షేమాలు కంటికి రెప్పలా కాపాడుతున్న అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వాలు వారిని నిర్వీర్యం చేస్తూ వారంతట్ట వారే డ్యూటీలు మానేసేలా చేసి వారి ఉద్యోగాలను వదిలి వెళ్ళేలా చేస్తున్న పాలకవర్గాల ప్రయత్నాలన్నింటిని తిప్పి కొట్టాలని ఐక్యంగా ఉద్యమించాలని ఆయన కోరుతూ టీచర్లకు 41 వేల రూపాయల వేతనం, హెల్పర్లకు ,35 వే వేతనాలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఓ కు వినతి పత్రాన్ని అందజేశారు . ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కూరపాటి శైలజ , కళావతి , జయలక్ష్మి , ప్రసన్న , రాజేశ్వరి , సుజాత ,భవాని , సుభద్ర తదితరులు పాల్గొన్నారు

## జులై 14న భూపాలపల్లిలో జాబ్ మేళా

*** జోయాలుక్కాస్‌లో 100 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నియామకాలు.. యువతకు ఉపాధి అవకాశం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ (మంగళవారం) ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహించనున్నారు. భూపాలపల్లి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ నియామక ప్రక్రియ జరగనుంది. ఈ జాబ్ మేళాలో హనుమకొండకు చెందిన ప్రముఖ జువెలరీ సంస్థ జోయాలుక్కాస్ సంస్థ పాల్గొని సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. మొత్తం 100 ఖాళీలు ఉండగా, అందులో పురుషులకు 50, మహిళలకు 50 పోస్టులు కేటాయించారు. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా ఐటీఐ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.22,000 వేతనం చెల్లించనుండగా, హనుమకొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థ ఉద్యోగులకు ఆకర్షణీయమైన వేతనంతో పాటు ప్రోత్సాహకాలు, బోనస్, సెలవు ప్రయోజనాలు, గ్రాట్యుటీ, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటాతో పాటు ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9502468800 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

*** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

*** 5వ వార్డులో రూ.36 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పట్టణ ప్రణాళిక అభివృద్ధిలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ 5వ వార్డులోని చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో రూ.36 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంతో పాటు ఆధునిక మౌలిక వసతుల కల్పన కోసం దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, నరేష్, కౌన్సిలర్ కొప్పినూరు ప్రవీణ్, రాజు నాయక్, మురళీమోహన్ (అప్పి), అనిల్ కుమార్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, లతా శ్రీశైలం గౌడ్, సాదిక్, కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, రవికుమార్ గుప్తా, సర్పంచ్ చందు నాయక్, మహబూబ్, రవితేజ, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాక వరసిద్ధి వినాయక వాసవి నిత్య అన్నదాన సత్ర కార్యవర్గ సభ్యుడిగా వేమిశెట్టి కిషోర్ కుమార్

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్య అన్నదాన సత్రం ట్రస్టు కానిపాకం కార్యవర్గ సభ్యుడుగా మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సేవా తత్పరులు సత్ర ట్రస్టు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికై గురువారం స్వామివారి ఆశీస్సులతో ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది అధ్యక్షుడిగా ఇరుకుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పొన్నూరు రామకుమార్, కోశాధికారి నాగ సుగుణాకర్ రావు ప్రమాణ స్వీకారం చేయగా వారితోపాటు వేమిశెట్టి కిషోర్ కుమార్ కార్యవర్గ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసి ట్రస్ట్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. నా మీద నమ్మకంతో విశ్వాసంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవి ఇచ్చి సహకరించిన వారైనా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారికి, సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపుతున్నట్లు ఆయన అన్నారు. ముత్యం అన్నదాన సత్ర ట్రస్టు కార్యవర్గ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వేమిశెట్టి కిషోర్ కుమార్ కు జిల్లా కేంద్రానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు స్నేహితులు బంధుమిత్రులు రాజకీయ ప్రముఖులు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేసి మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరుతున్నారు.



## హలో గౌడన్న చలో హుస్నాబాద్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గౌడ సమస్య ల పైన నిరంతరం కొట్లాడే గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ, రాష్ట్ర స్థాయి సమావేశం,ఈనెల 12 ఆదివారం ఉదయం 11 గంటలకు సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలోని బిఎంకె బ్యాంకెట్ హాల్ ఏసి లో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుంది.ఈ సమావేశానికి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సా గౌడ్ జనరల్ సెక్రెటరీ సిద్ద రాములు గౌడ్ ప్రధాన కార్యదర్శి ,ముత్యం నర్సిములు గౌడ్, అధికార ప్రతినిధి బాలరాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్, రాష్ట్ర యువజన అధ్యక్షులు కిరణ్ గౌడ్ పాల్గొంటారు,రాష్ట్ర, నాయకులు,రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ నాయకులు అందరు పాల్గొంటారు,ఈ సమావేశానికి మహబూబాబాద్ జిల్లా కమిటీ, మండల కమిటీ అధ్యక్షులు పాల్గొని ఈ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నాం.ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిగే భద్రసేన గౌడ్, అధికార ప్రతినిధి లింగాల విరభద్రం గౌడ్, కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్, గౌరవ అధ్యక్షులు గాడిపెల్లి శేఖర్ గౌడ్,కురవి మండల అధ్యక్షులు తండా నాగేందర్ గౌడ్,యాసరపు నారాయణ, గౌని వెంకన్న,గుండగని దశరతం,నక్క ఉప్పలయ్య,రమేష్ గౌడ్,మహేష్ గౌడ్, బిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.

## 'మొక్క' ఇచ్చి వెంకటయ్యు శుభాకాంక్షలు తెలిపిన ప్రకృతి ప్రేమికులు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసి మొక్కలు నాటడం, పెంచడం, పంచడాన్ని జీవన లక్ష్యంగా చేసుకుని తన పేరునే మొక్కల వెంకటయ్యగా మార్చుకున్న రావి వెంకటయ్య పుట్టినరోజు సందర్భంగా ప్రకృతి ప్రేమికులు ఆయనకు పచ్చని మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతానికి చెందిన వెంకటయ్య 75వ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ప్రకృతి ప్రేమికులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. 'బొకే వద్దు.. పూల మొక్కలే ముద్దు' అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా, ప్రకృతి వైద్యులు జి. సుగుణారావు మొక్కల వెంకటయ్యకు పచ్చని మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి శుభ సందర్భాల్లో పూల బొకేలకు బదులుగా మొక్కలను బహుమతిగా అందించే సాంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి హరిత దీక్షకులు ఆఫాన్ జైదీ, ముస్తఫా, పర్వీన్, రావి లక్ష్మి, అనువంశిక వైద్యులు రామంచి శ్రీనివాస్, సాగర్, దశరథ్ రజువా, శంకర్, శిరీష, కుమారి, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికై బాధ్యతగా కృషిచేయాలి

**– లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులకు సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు షడిగి తెలుసుకున్నారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని ఎస్పీ సూఇచంచారు. సీఐఈఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత, నిర్వాహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సైలు అఖిల, రాజమౌళి, సిబ్బంది ఉన్నారు.

# ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలి

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమము జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించనైనది. ఇట్టి అవగాహన కార్యక్రమానికి 07 మండలాలకు సంబంధించి భువనగిరి , బీబీనగర్, పోచంపల్లి,వలిగొండ, రామన్నపేట, చౌటుప్పల్, నారాయణపూర్ మండలాలకు చెందిన సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు మరియు అధికారుల కోసం జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జెడ్పీ సీఈఓ శోభా రాణి,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మండల పంచాయతీ అధికారులు సంబంధిత శాఖల అధికారులు గ్రామాల సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ వనరుల పెంపు 16వ ఆర్థిక సంఘం నిధుల సమర్థ వినియోగం (గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక) రూపకల్పన,వీబీ జి రామ్‌జీ చట్టం 2025, జల్ సిరి (నీటి సంరక్షణ కార్యక్రమం) మరియు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు.

# ఎస్ఐఆర్‌లో నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్

* **20లోగా నమోదు పూర్తి చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించే బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. అలసత్వం వహించిన వారిని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం విధుల నుంచి సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో ఎస్ఐఆర్ నమోదు కేవలం 14 శాతానికి, ఇతర మండలాల్లో సుమారు 50 శాతానికే పరిమితమవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 10 శాతం కంటే తక్కువ నమోదు చేసిన బీఎల్‌వోలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు అందజేసి, వాటిని పూర్తిగా నింపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బందితో పాటు ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా వీడియోలు, సందేశాలు పంపించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. శని, ఆదివారాల్లో అన్ని మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఎస్ఐఆర్ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించిన కలెక్టర్, ఈ నెల 20వ తేదీలోపు నమోదు ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. త్వరలో ఎన్నికల కమిషన్ బృందం జిల్లాలో తనిఖీలు నిర్వహించనున్నందున లక్ష్యాన్ని సాధించని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని, ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# ఆరోగ్యశాఖ మంత్రికి ఎస్‌పీఎస్ సంఘం కృతజ్ఞతలు

* **ప్రభుత్వ ఆస్పత్రి బెడ్‌సైడ్ కార్మికులకు 1వ తేదీకే వేతనాలు**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న బెడ్‌సైడ్ కార్మికులకు ప్రతి నెల 1వ తేదీకే వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నందుకు ఎస్ పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.ఐఎఫ్ ఎం ఎస్లో సవరణలు చేపట్టడంతో రాష్ట్రంలోని సుమారు 18 వేల మంది కార్మిక కుటుంబాలకు ఊరట లభించనుందని సంఘం పేర్కొంది. శుక్రవారం హైదరా బాద్, బంజారాహిల్స్‌లోని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాసంలో ఎస్‌పీఎస్ రాష్ట్ర కమిటీ నేతలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్‌లు 18 వేల మంది కార్మికులను ఐఎఫ్ ఎం ఎస్లో లో విలీనం చేసి రూ.26 వేల స్థిర వేతనం అమలు చేయాలని, వేతనాల పెంపు, మహిళా కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని మంత్రిని కోరారు. అలాగే బెడ్‌సైడ్ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, సదుపాయాలు ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలన్నింటినీ మంత్రి సానుకూలంగా విన్నారని, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏనుగుల రఘు, ప్రధాన కార్యదర్శి గండి అజయ్, వైనాల రవి, మాతంగి అనిల్ కుమార్, ఉభయ రమక్క, చి.నాగమణి, ఎస్కే సైదాబీ, నాగేశ్వరరావుతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్‌పీఎస్ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా కల్పించడమే లక్ష్యం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బాధితులకు సత్వర న్యాయం, రక్షణ, పునరావాసం కల్పించడంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో అన్ని శాఖల అధికారులు, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో కలిసి నిర్వహించిన భరోసా సమన్వయ సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్, మాట్లాడుతూ బాధితులకు న్యాయ, వైద్య, మానసిక పరామర్శ, రక్షణ సేవలు అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను అధికారులను అడిగి తెలుసుకుని, సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.పిల్లలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాల నివారణకు పాఠశాల స్థాయిలోనే పోక్సో చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.ప్రతి విద్యార్థికి తమ హక్కులు,రక్షణ చట్టాలు,గుడ్ టచ్-బ్యాడ్ టచ్ వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడికి ప్రభుత్వం అండగా ఉందనే విశ్వాసం కలిగేలా అన్ని శాఖలు పరస్పర సహకారంతో పని చేయాలని, మహిళలు,చిన్నారుల భద్రత, సంక్షేమం విషయంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ తెలిపారు.అధికారులందరూ సమన్వయంతో పని చేసినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం అందుతుందని,ప్రతి శాఖ ఒకరికొకరు సహకరిస్తూ ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు . అలాగే సమాజంలో శాశ్వత మార్పు కోసం పాఠశాల స్థాయిలోనే పిల్లలకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించడం అత్యంత అవసరం" అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి , డిస్ట్రిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్య నారాయణ మూర్తి , జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ గవర్నమెంట్ హాస్పిటల్ డా.శ్రీనివాస్,బాల రక్షక్ భవన్ కోఆర్డినేటర్ చైతన్య, డి.ఎల్.ఎస్.ఏ అడ్వకేట్ రాజ్ కృష్ణ, భరోసా కేంద్రం, సఖీ కేంద్రం, షీ టీమ్స్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో విద్యాసంస్థల బంద్ విజయవంతం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యార్థులపై మోపుతున్న ఆర్థిక భారాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపు చౌటుప్పల్ మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆసరా ప్రకాష్, మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ప్రభుత్వం సహకరించాల్సిన సమయంలో బకాయిల విడుదలలో తీవ్ర జాప్యం చేయడం వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో ప్రస్తుతం ఉన్న సుమారు 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేలకే పరిమితం చేసే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండగా, ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే విధానాలు విద్యా హక్కుకు విరుద్ధమని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిఈఓ, ఉపాధ్యాయులు, లెక్చరర్లు తదితర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలను పునర్నిర్మించి విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపే జీవో నెం. 7, 8, 9లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరుగుతున్న ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల ఖర్చులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చి పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యారంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్ మండల కేంద్రంతో పాటు తంగడపల్లి, చిన్నకొండూరు, కొయ్యలగూడెం, కైతాపురం, దేవలమ్మ నాగారం, పిల్లాయిపల్లి, జైకేసారం, కుంట్లగూడెం, పెద్దకొండూరు, మసీదుగూడెం, మల్కాపురం తదితర గ్రామాల్లో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగిందని తెలిపారు. విద్యాసంస్థల బంద్‌కు సహకరించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు, అధ్యాపకులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ప్రజాసంఘాల నాయకులకు వామపక్ష విద్యార్థి సంఘాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు తమ ఉద్యమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దోనూరు శ్రావణ్, ఎరిగి వరుణ్ తేజ్, మండల నాయకులు మల్లేష్, మణికంఠ, సిద్దు, బన్నీ, జయంత్, అభి, మోసిన్, నవదీప్, నరసింహ, రామ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

* **వీడియో కాన్ఫరెన్స్ లో ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ పవన్ కుమార్ శర్మ**
* **వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు,కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు ఈరోజు పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపర్ డెండెంట్, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 124 కోట్లతో సంగెం


* **ధర్మారెడ్డిపల్లి–గోకారం ధర్మారెడ్డి కాలువకు పునర్జీవం**
* **పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



వలిగొండ ప్రజాస్ఫూర్తి : మండలంలోని సంగెం,ధర్మారెడ్డిపల్లి,గోకారం గ్రామాలలో రూ.124 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డి కాలువ అభివృద్ధి పనులను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, కాలువ వెడల్పు, లోతు, నీటి ప్రవాహానికి చేపట్టిన ఏర్పాట్లు, కాలువకు ఆనుకుని నిర్మిస్తున్న దారి తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ధర్మారెడ్డి పల్లి కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. కాలువలో రాళ్లు, మట్టి, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అంతేకాకుండా కాలువ పక్కన ఉన్న దారి కూడా పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు, రైతులు నడిచి వెళ్లడానికే ఇబ్బందిగా ఉండేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రూ.124 కోట్ల భారీ నిధులను మంజూరు చేసి ధర్మారెడ్డి కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిందన్నారు. కాలువతో పాటు పక్కనే ఉన్న రహదారిని కూడా అభివృద్ధి చేయడం వల్ల గతంలో నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి నుంచి నేడు వాహనాలు సైతం సులభంగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన మూసీ ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా సంగెం బ్రిడ్జి మంజూరు కావడం ఈ ప్రాంత అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తోందని అన్నారు ధర్మారెడ్డి కాలువ అభివృద్ధి పనులు పూర్తికావడంతో సంగెం, ధర్మారెడ్డిపల్లి, గోకారం, వర్కట్‌పల్లి గ్రామాల రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.ఈ కాలువ ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందడంతో వ్యవసాయోత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ నెల 17న ధర్మారెడ్డి కాలువలో నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి నాయకులు గరిసె రవి బత్తిని లింగయ్య చెరుకు శివయ్య బెలిదే నాగేశ్వర్ కాసుల వెంకన్న గౌడ్ కొండూరు సాయి చిలుగూరు సత్తిరెడ్డి ప్రజలు రైతులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం శంకుస్థాపన

* **కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సుమారు ఒక ఎకరా స్థలంలో కమిటీ హాల్ నిర్మాణం కోసం శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జిల్లా కమ్యూనిటీ ఆ నిర్మాణంకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం తరఫునుండి 50 లక్షల రూపాయల నిధులను కేటాయించడం జరిగిందని తెలిపారు. బ్రాహ్మణ సంఘం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చలక రాజేశ్వర శర్మ, నాయకులు వైద్య శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బ్రాహ్మణ భవనం నిర్మాణానికి మైనంపల్లి సహకరించడం ఎంతో సంతోషకరమైన విషయం అని ఈ భవనం సేవా కార్యక్రమాలు చేయడం కోసం నిర్వహిస్తామని, నిత్యం అన్నదాన కార్యక్రమం తో పాటు వేసవి కాలంలో తాగునీటి వసతులు కల్పించడంతోపాటు వివిధ కార్యక్రమాల నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని నిరుపేదలకు ఉచితంగా పెళ్లిళ్లు చేసుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు హరిప్రసాద్ శర్మ, దేశ పేట లింగమూర్తి, వైద్య ప్రభాకర్ శర్మ, డిజే శ్రీనివాస్ శర్మ, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# మధుర పరిమళాల మనోహారం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన





కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా ఫ్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

**వడదెబ్బ తగలకుండా..!**

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.



**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.



# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్‌కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.



సినిమా



# ఇన్‌స్టాతోనూ ఇన్‌కం

ఓవైపు సినిమాలతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా సెలబ్రిటీలు లక్షలు, కోట్లల్లో వెనకేసుకుంటున్నారు. ఇన్‌స్టా, ట్విట్టర్‌లలో ఫాలోవర్స్‌ను బట్టి పారితోషకం డిమాండ్ చేస్తున్నారు. దీపికా పడుకోన్ ఇన్‌స్టాలో ఒక్కో పోస్ట్ కోసం రెండు కోట్లు, రష్మిక 25 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారట. విరాట్ కోహ్లి అయితే ఒక్కో ఇన్‌స్టా పోస్ట్‌కు 14 కోట్లతో రికార్డ్ క్రియేట్ చేశాడు. ఇప్పుడు ఈ లిస్ట్‌లో ధమాకా బ్యూటీ శ్రీలీల కూడా చేరిపోయింది. ఇన్‌స్టాలో ఈ అమ్మడుకు 16 మిలియన్లకుపైనే ఫాలోవర్లు ఉన్నారు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో ఉన్న క్రేజ్ కారణంగా ఎండార్స్‌మెంట్ డీల్స్ బాగానే వస్తున్నాయని టాక్. ఇన్‌స్టాలో ఒక్కో బ్రాండ్ ప్రమోషన్ పోస్ట్ కోసం ఐదు నుంచి ఆరు లక్షల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటుందట. ఇలా నెలకు 30 నుంచి 50 లక్షల మధ్య సంపాదిస్తున్నట్లు సమాచారం. మూవీస్ కంటే సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ డబ్బులను వెనకేసుకుంటుందని అంటున్నారు.కాగా ప్రస్తుతం శ్రీలీల తమిళంలో ధనుష్‌తో ఓం ఛాప్టర్ వన్ సినిమా చేస్తోంది.



# అలా నటిస్తే ఇమేజ్ పోతుంది

సుదీర్ఘ కెరీర్‌లో కాజల్ ఇప్పటివరకు బికినీ ధరించి ఒక్క సినిమాలో కనిపించలేదు. పెద్ది మూవీలో జాన్వీ పాత్రపై వచ్చిన విమర్శల నేపథ్యంలో నో బికినీ రూల్‌పై ది ఇండియా స్టోరీ ప్రమోషన్స్‌లో తాజాగా రియాక్ట్ అయ్యింది కాజల్. "ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన కొత్తలోనే నాకంటూ కొన్ని లిమిట్స్ పెట్టుకున్నా. హద్దులు దాటినట్లు అనిపిస్తే ఎంత పెద్ద బ్యానర్, స్టార్ అన్నది కూడా చూడకుండా రిజెక్ట్ చేస్తుంటా. అలా వదులుకున్న సినిమాలు చాలానే ఉన్నాయి. కొన్ని పెద్ద హిట్టయ్యాయి. కానీ అవేవీ నా ఆలోచన విధానాన్ని మార్చలేదు. హద్దులు విధించుకోవడం అందరికి మంచిది. బికినీ, గ్లామర్ సీన్ల వల్ల సినిమాలకు పెద్దగా ఉపయోగం ఉండదు అని కాజల్ చెప్పుకొచ్చింది.


# యశ్‌తో రొమాన్స్‌కు రెడీ

టాలీవుడ్‌లో లక్కీ ఛార్మ్‌గా కొనసాగుతోంది మీనాక్షి చౌదరి. తెలుగు, తమిళ భాషల్లో వరుస ఆఫర్లను చేజిక్కించుకుంటున్న ఈ బ్యూటీ తాజాగా శాండల్‌వుడ్‌పై కన్నేసిందట. కేజీఎఫ్ హీరో యశ్‌తో రొమాన్స్ చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే రామాయణ షూటింగ్‌ను పూర్తి చేసిన యశ్ కన్నడంలో ఓ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి ఓకే చెప్పాడని అంటున్నారు. నార్తన్ దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియన్ మూవీలో హీరోయిన్లుగా త్రిప్తి డిమ్రితో పాటు మీనాక్షి చౌదరి పేర్లు వినిపిస్తున్నాయి. కన్నడ ఎంట్రీ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తోన్న మీనాక్షి వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. త్వరలోనే ఈ మూవీపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు వార్తలొస్తున్నాయి. కాగా మీనాక్షి హీరోయిన్‌గా ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన అనగనగా ఒక రాజు వంద కోట్ల వసూళ్లను రాబట్టింది.





# కొరియన్ కనకరాజు వస్తున్నాడు



మెగా హీరో వరుణ్ తేజ్ హిట్టు కొట్టి చాలా కాలమే అయ్యింది. ప్రయోగాత్మక కథాంశాలతో అతడు చేసిన గత సినిమాలేవి సరైన విజయాలను అందుకోలేదు. ప్రస్తుతం కొరియన్ కనకరాజు పేరుతో ఓ హారర్ కామెడీ మూవీ చేస్తున్నాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మిరాయ్ ఫేమ్ రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ శుక్రవారం కన్ఫామ్ చేశారు. ఆగస్ట్ 7న ఈ మూవీ థియేటర్లలోకి రాబోతున్నట్లు ప్రకటించారు. ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. చేతిలో కత్తి పట్టుకొని లుంగీ ధరించి మాస్ లుక్‌లో వరుణ్ తేజ్ కనిపిస్తున్నారు. అతడి వెనుక కొందరు కొరియన్ వ్యక్తులు గన్నులు పట్టుకొని ఉండటం ఆసక్తిని పంచుతోంది. ఓ చిత్తూరు యువకుడు కొరియాకు ఎందుకెళ్లాడు? గ్యాంగ్‌స్టర్ ఆత్మ అతడిలోకి ఎలా ప్రవేశించిందనే అంశాలతో ఈ సినిమా తెరకెక్కుతోంది.

# శ్రీ శ్రీలో శ్రీమతిగా..

నాలుగేళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత బుట్టబొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతుంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. శ్రీ శ్రీ అనే పేరును ఖరారు చేశారు. ఫస్ట్ లుక్‌లో దుల్కర్, పూజా యూనిఫామ్‌ను పోలిన ఒకే కలర్ డ్రెస్‌లో కనిపిస్తున్నారు. ఓ గోడపై కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ సింపుల్ లుక్‌లో అట్రాక్షన్‌గా కనిపిస్తున్నారు. యూనిక్ లవ్‌స్టోరీగా ఈ మూవీ తెరకెక్కనున్నట్లు సమాచారం. హీరోహీరోయిన్ల పేర్లలోని తొలి అక్షరాలను సూచిస్తూ టైటిల్ కన్ఫామ్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఇందులో శ్రీమతిగా పూజా, శ్రీనివాస్ అనే పాత్రలో దుల్కర్ నటిస్తున్నట్లు చెబుతోన్నారు. ఈ మూవీకి రవి నేలకుడిటి దర్శకత్వం వహిస్తుండగా జీవీ ప్రకాశ్‌కుమార్ మ్యూజిక్ సమకూరుస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఒకేసారి రిలీజ్ కాబోతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.